


మరిపెడ మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీమన్నారాయణ రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మండల్ పరిషత్ స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీమన్నారాయణరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను కలెక్టర్ బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఈయన నియామకం అయ్యారు. బాధ్యత లు తీసుకున్న శ్రీమన్నారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందచేసి ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఆ కార్యాలయ ఉద్యోగులు అభి నందనలు తెలిపారు.



కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలో వీధిలైట్లు వెలగకపోవడంతో చీకటిమయమైన మార్కెట్ రోడ్

నిధుల లేమి.. సమస్యల కొలిమి

కేసముద్రం మునిసిపాలిటీలో అధ్వానంగా రహదారులు



రెండు నెలలుగా వీధిదీపాలు వెలగడంలేదు..

ఇస్సంపల్లి అరవింద, గృహిణి, కేసముద్రం మునిసిపాలిటీ

కేసముద్రం మార్కెట్ రోడ్‌లో కొన్ని వీధిదీపాలు రెండు నెలలుగా వెలగ డంలేదు. మార్చాలని సంబంధిత సిబ్బందికి చెప్పినప్పటికీ వాటిని మార్చడంలేదు. దీంతో వీధులు చీకటిమయమవుతుండడంతో రోడ్ల వెంట మహిళలు నడిచేందుకు భయాందోళన చెందుతున్నారు. వెంటనే కొత్త లైట్లు ఏర్పాటు చేయాలి.

- గుంతలమయమైన రోడ్లు
- వీధిదీపాలకు డబ్బులు కరువు
- నిర్వహణకు నిధులు శూన్యం
- ఇంటిపన్నుల నుంచే సిబ్బందికి వేతనాలు
- సిబ్బంది అంతా డిప్యూటేషన్, ఇన్‌చార్జులే

కేసముద్రం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ నిధుల లేమి, సమస్యలతో కొట్టుమిట్టాడు తోంది. వీధిదీపాలు వెలగక ప్రధాన రహదారి చీకటిలో మగ్గు తుండగా గ్రామాల్లోని పలు కాలనీల్లో రోజుల తరబడి లైట్లు రావడంలేదు. గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు సర్పంచ్, కార్య దర్శికి తమ సమస్యలను విన్నవిస్తే వెంటనే పరిష్కారమ య్యేది. అలాంటి మునిసిపాలిటీలో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో ప్రజలకు తెలియడంలేదు. ఒకవేళ ఎవరైనా సిబ్బంది దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా మునిసిపా లిటీలో డబ్బులు లేవని, ఆ సమస్యను పరిష్కరిం చలేమని చేతులెత్తేస్తున్నారు. ఈ ఏడాది జన వరి 25న కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజి, అమినాపురం, ధన్నసరి, ఎస్టీకాలనీ(సబ్‌స్టేషన్‌తండ) గ్రామపంచాయతీల విలీనంతో కేసముద్రం మునిసిపాలిటీ ఏర్పాటు చేశారు. అదేనెల 27 వరకు ఆయా గ్రామపంచాయతీల్లో పనిచేసే కార్మికులను మరుసటి రోజు నుంచి మునిసిపాలిటీ పరిధిలో కలిపారు. 55 మంది పారి శుధ్య కార్మికులు, అటెండర్లు, 14 మంది వాటర్‌మెన్‌లు, ఏడు గురు ఎలక్ట్రిషియన్లు, ఆరుగురు డ్రైవర్లు వెరసి 82మంది ని మునిసిపాలిటీ పరిధిలోకి తీసుకున్నారు. ఆ రోజు నుంచి మునిసిపాలిటీ పరిధి లోనే కార్మికులు తమకు కేటాయిం చిన విధులను నిర్వర్తిస్తున్నారు.



కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

నెలకు రూ.16లక్షల నిర్వహణ...

కేసముద్రం మునిసిపాలిటీలో 82 మంది కార్మికుల వేతనాలకు రూ.7లక్షలతో పాటు కరెంటు బిల్లులు, ఇతర నిర్వహణ ఖర్చులకు నెలకు రూ.16లక్షల అవుతున్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఈ మునిసిపాలిటీకి విడుదల కాకపోవడం గమనార్హం. మునిసిపాలిటీ పరిధిలోని ఇంటి, నల్లా పన్నులు, వాణిజ్య లైసె న్సులు, అంగడి వేలం ద్వారా వస్తున్న ఆదాయంతోనే నెట్టుకొస్తున్నారు.

వీధిదీపాలు వెలగవు... రోడ్లపై గజానికో గుంత...

మునిసిపాలిటీ పరిధిలోని ఐదు గ్రామాల్లో వీధిదీపాలు కాలి పోతే వాటిని మార్చే నాధుడే లేడు. పాత లైట్లనే మరమ్మతులు చేయించి అక్కడక్కడా మారుస్తున్నారు తప్ప కొత్త లైటు ఒక్కటి కూడా అందుబాటులో లేదు. దీంతో లైట్లు కాలిపోయిన ప్రాంతంలో చీకటి నెలకొని రోజుల తర బడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



కేసముద్రంలో గుంతలమయమైన రోడ్డు

2,862 కొత్త లైట్లు అవసరం ఉన్నట్లు గుర్తించి ప్రతిపాదనలను పంపినట్లు తెలిసింది. అక్కడక్కడా పైపులైన్లు లీకేజి అవుతుండడం రోజుల తరబడి మరమ్మతులు చేయకుండా ఉంటుండడంతో తాగునీటి సరఫరా నెలల తరబడి నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. మరోవైపు మునిసిపల్ పరిధిలోని రోడ్లు గుంతలమయమై వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. అంబేద్కర్ సెంటర్ నుంచి విలేజి దర్గా వరకు రోడ్డుపై గజానికో గుంత ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని మరమ్మతులు చేయించే వారే కరువయ్యారు.

అంతా డిప్యూటేషన్, ఇన్‌చార్జులే...

మునిసిపాలిటీ ఏర్పడి ఎనిమిది నెలలు కావొస్తున్నప్పటికీ శాశ్వత ఇక్కడ సిబ్బందిని మునిసిపల్ శాఖ కేటాయించలేదు. మహబూబాబాద్

(మిగతా 6లో..)

బిట్ కాయిన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ మోసం..

- రూ. 32.53 లక్షలు పోగొట్టుకున్న మెడికల్ షాపు నిర్వాహకుడు
- మహబూబాబాద్ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి..
- టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు



బిట్ కాయిన్ ట్రేడింగ్ యాప్

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేర గాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు. డబ్బులను కాజేయడానికి నూతన పద్ధతులను అవలంబిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ మెడికల్ షాపు నిర్వాహకుడి నుంచి బిట్ కాయిన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు రూ. 32.53 లక్షలు కాజేయగా, ఈ విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణంలోని పాత బజారుకు చెందిన ఓ మెడికల్ షాపు నిర్వాహకునికి జూన్ మాసంలో తన మొబైల్‌కు వాట్సాప్ ద్వారా 'షాది.కామ్' అని మెసేజ్ చేసి మి డిటెయిల్స్ కావాలని అడిగారు. బాధితుడు తనకు వివాహమైందని చెప్పాడు. వారు మరిన్నీ విషయాలు అడుగ్గా చెప్పడాని బాధితుడు నిరా కరించినట్లు తెలిపారు. కొన్ని రోజుల తర్వాత అదే వాట్సాప్ నెంబరు నుంచి బిట్ కాయిన్ ట్రేడింగ్ గురించి చెప్పి, ఇందులో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పి ఒక లింక్ పంపగా ఆ లింక్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. తర్వాత వారు చెప్పిన విధంగా మొద టగా రూ. 50 వేలు, ఆ తర్వాత రూ. 5 లక్షలు పంపించగా, వాళ్లు బాధి తుని వాలెట్‌లో రూ.10 లక్షలు బ్యాలన్స్ ఉన్నట్లు చూపించి నమ్మపలి కారు. ఇది నిజం అనుకొని నమ్మిన మెడికల్ షాపు నిర్వాహకుడు పలు దఫాలుగా వాళ్లు చెప్పినట్లుగా వివిధ అకౌంట్ నంబర్లకు మొత్తం రూ. 32,53,447 రూపాయలు పంపించాడు. ఆ తర్వాత బాధితుని అకౌంట్‌లో జమకాలేదని, ఆ లావాదేవీలు జరిగిన తర్వాత కూడా డబ్బులు జమ చేయకుండా ఇంకా డబ్బులు జమ చేయాలని అడుగుతుండడంతో తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గమనించాడు. దీంతో ఈ నెల 10న టోల్‌ఫ్రీ నంబరు 1930 కాల్‌చేసి, టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మహేందర్ రెడ్డి వివరించారు. సైబర్ మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని, మొబైల్‌కు వచ్చే వాట్సాప్ లింక్స్‌ను ఓపెన్ చేయరాదన్నారు.

సీఎం పర్యటన వాయిదా

ములుగు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం మహా జాతర పనులను ప్రత్యక్షంగా పరిశీలించేం దుకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి రావాల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల ముఖ్యమంత్రి పర్యటన రద్దయింది. తదుపరి తేదీని ప్రకటించాల్సి ఉంది. కాగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో సీఎం పర్య టన రద్దయిందని, చత్తీస్‌గఢ్ పోలీస్, మావోయిస్టులకు మధ్య జరుగు తున్న ఎదురు కాల్పులు కారణమై ఉండవచ్చని జిల్లా వ్యాప్తంగా చర్చ నడుస్తోంది. సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల మార్పులను పలువురు వ్యతిరేకిస్తుండడంతో సీఎం పర్యటనను వాయిదా చేసుకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ నెల 18న సీఎం రేవంత్‌రెడ్డి ములుగు జిల్లా పర్యటన ఉంటుందని, 2026 జనవరి 28న జరగబోయే మహాజాతర పనులను ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా పరిశీలిస్తా రని అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ఇబ్బంది లేకుండా బస్తాలు అందించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

డోర్నకల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాధి కారులు పక్కా ప్రణాళికతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా బస్తాలను అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. శుక్రవారం డోర్నకల్ పీఏసీ ఎస్ కార్యాలయంలో యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కోసం వచ్చిన రైతులు వేచి ఉండే విధంగా టెంట్, మంచినీళ్లు అందుబాటులో ఉంచాలన్నారు.

అనంతరం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీ లించి విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందించాలన్నారు. ఆ తర్వాత డోర్నకల్ ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడి రోగులకు అందు తున్న వైద్యంపై ఆరాతీసి రిజిస్టర్‌లను పరిశీలించారు. కలె క్టర్ వెంట డీపీవో హరిప్రసాద్, మండల ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి, తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో మురళీమోహన్ ఉన్నారు.



యూరియా పంపిణీ వివరాలు తెలుసుకుంటున్న అద్వైత్‌కుమార్‌సింగ్

రైతులు ఆందోళన చెందవద్దు

- గార్ల : రైతులు యూరియా పంపిణీ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. ముల్క నూరులో పంపిణీ చేస్తున్న యూరియా సర ఫరా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రైతు లకు అందుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులకు సరిపడా యూరియాను అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుం దని, రైతులు ఇబ్బంది పడవద్దన్నారు.

హాస్టల్ వార్డెన్‌లు స్థానికంగా ఉండాలి

హాస్టల్ వార్డెన్‌లు స్థాని కంగా ఉంటూ, తమ విధులు నిర్వహించాలని అద్వైత్‌కు మార్‌సింగ్ అన్నారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థినులకు అందుతున్న విద్య గురించి తెలుసుకున్నారు. హాస్టల్స్ లోని పరిసరాలను పరిశీ లించి, పరిశుభ్రంగా ఉండే విధంగా వార్డెన్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షకాలం సీజన్ కాబట్టి ఎల్లవేళలా వైద్య సిబ్బంది వార్డెన్‌లు విద్యార్థినులకు అందుబా టులో ఉండాలన్నారు. తహ సీల్దార్ శారద, ఎంపీడీఈవో మంగమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంలు అందించాలి : సీపీఎం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నాగయ్య

తొర్రూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇల్లులేని నిరుపేదలందరికీ తొర్రూ రులో నిర్మించి ఉన్న డబుల్ బెడ్‌రూంలు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. శుక్రవారం తొర్రూరులో నిర్మించి ఉన్న డబు ల్ బెడ్‌రూంలను పరిశీలించి ఇల్లులేని నిరుపేదలకు ఇళ్లను వెంటనే కేటాయిం చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 280ఇండ్లు నిర్మించి అర్హులకు అందిం చకుండా వృథాగా వదిలేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇళ్లు ఇస్తామని పట్టించకోకపోవడం సరికాదని, గత 6నెలలుగా లబ్ధిదారులు, సీపీఎం నాయకులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం సరికాదని, వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని, లేనిచో పార్టీ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్షలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లం అశోక్, యాకూబ్, శ్రీను, మమత, సంపత్, వరలక్ష్మి, లబ్ధిదారులు ఉన్నారు.

మళ్లీ రోడ్డెక్కిన రైతన్నలు

- యూరియా కోసం మరిపెడ రహదారిపై ధర్నా
- పోలీసుల బుజ్జగింపుతో శాంతించిన అన్నదాతలు



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఎస్సైలు సతీశ్, కోటేశ్వర్‌రావు

మరిపెడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్, ఎస్పీ యూరియా పంపిణీలో రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దని ఊరూరా రైతు వేదిక వద్ద యూరియా పంపిణీ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ కిందిస్థాయి అధికారుల చిన్న చిన్న తప్పిదాలతో అన్నదాతలు మళ్లీ రోడ్డెక్కే పరిస్థితులు జిల్లాలో అక్కడక్కడ దాపరిస్తున్నాయి. ఈ క్రమంలోనే మరిపెడ పీఏసీఎస్ వద్ద యూరియా పంపిణీ ఎప్పటిలానే ఉంటుందని గుర్తించి మరిపెడ రైతులు శుక్రవారం కోడికూయక మునుపే అక్కడికి చేరుకొని క్యూలైన్లో నిలిచారు. తెల్లారాక సిబ్బంది వచ్చి ఈ రోజు యూరియా రావట్లేదని రైతులకు చెప్పడంతో ఆగ్రహించిన రైతులు ఈ విషయాన్ని ముందే ఎందుకు చెప్ప లేదని కోపోద్రుక్తులై మరిపెడ సెంట్రల్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకొని జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో రైతులు మళ్లీ రోడ్డెక్కారని వాహనదారులు వాపోయారు. ఈ విషయం తెలుసుకొని మరిపెడ ఎస్సైలు సతీశ్, కోటేశ్వర్‌రా వులు అక్కడికి సిబ్బందితో చేరుకొని రైతులకు అధికారులతో మాట్లాడి నచ్చచెప్పిన ఫలితం లేదు. రైతుల ధర్నాతో వాహ నాలు రెండు వైపులా నిలిచిపోయాయి. సీఐ రాజ్‌కుమార్ వచ్చి రైతులకు ఈ రోజు యూరియా సరఫరా జరుగుతుందని పీఏసీఎస్ వద్దకు వెళ్లి క్యూలో ఉండదని చెప్పడంతో రైతులు ధర్నా విరమించి అక్కడికి వెళ్లారు. టోకెన్లు ఇచ్చాక లారీల ద్వారా యూరియాను రప్పించి సీఐ, ఎస్సైలు అక్కడే ఉండి రైతులకు యూరియా పంపిణీ చేయించారు.

చరిత్రలో నిలిచేలా నిర్మాణాలు

మేడారం దేవస్థానం అభివృద్ధిపై పూజారులు, ఆదివాసీ ప్రతినిధుల సమావేశం

తాడ్వాయి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం దేవ స్థానం అభివృద్ధి చరిత్రలో నిలిచేలా సమ్మక్క సార లమ్మ పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల అభివృద్ధి ఉండాలని వనదేవల పూజారులు, ఆదివాసీ సంఘాల ముఖ్య ప్రతినిధులు శుక్రవారం సమావేశ మయ్యారు. ఈ క్రమంలో మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో డాక్టర్ మైపతి తరుణ్ కుమార్ ఆదివాసీల మూడు నుంచి ఏడు గొట్లు(గోత్రాలు) మూలాలు, చిహ్నాలు, దేవస్థానాల నిర్మాణం, పడ గలు, లిపి, కోయల రాజరిక చరిత్ర ఆనవాళ్లు పలు అంశాలపై పూజారులకు వివరించారు. ఈ సంద ర్భంగా డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర చొరవతో మేడారం దేవస్థానం అభివృద్ధి నిర్మాణంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఆర్కిటెక్ రూపొందించిన వేల సంవత్సరాలు నిలిచేలా వనదేవతల దేవస్థానం మాస్టర్ ప్లాన్ రూపకల్పన నిర్మాణాల్లో ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు, చరిత్రలు, గొట్లు గోత్రాలు, మూలాలు, జీవన విధానం, సజీవంగా ఉండేందుకు ముందు తరాలకు తెలిపేలా ప్రణాళి కలు చేశామన్నారు. దేవస్థానం ద్వారాలు కూడా పూర్వ కోయ ద్వారాలు ఉన్నట్లుగా నిర్మించే విధంగా ప్రధాన ద్వారంపై ఆదివాసీ గొట్ల చిహ్నాలు, చిత్రాలు, ఇలవేల్పుల ప్రతీకలు, పడగలు, జంతులు, వృక్షాలు వంటి చరిత్ర తెలిపే విధంగా ఉంటాయని అన్నారు. వేరే మత చిత్రాలు ఈ దేవస్థానంలో నిర్మించడం ఉండదని నిర్ణయించడం జరిగింద న్నారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభు త్వానికి సమర్పించి మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేపట్టనున్నట్లు తెలిపారు. పూజారులు చందా రఘుపతి, సిద్దబోయిన స్వామి, నర్సింగరావు, కొక్కెర రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తున్న దృశ్యం, పాల్గొన్న పూజారులు, ఆదివాసీ ప్రతినిధులు

నేషనల్ టీచర్స్ సైన్స్ కాన్ఫరెన్స్-2025కు ఉపాధ్యాయుడు గురునాథరావు



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌ఘడ్ రాజధాని రాయపూర్‌లోని ఎన్.హెచ్. గోయల్ వరల్డ్ స్కూల్ వేదికగా నవంబరు 5 నుంచి 8 వరకు జరిగే నేషనల్ టీచర్స్ సైన్స్ కాన్ఫరెన్స్-2025కు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ భౌతికరసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ పూరె గురునాథరావు ఎంపికయ్యారు. జాతీయ విద్యావిధానం 2020 ద్వారా విద్యారంగంలో పరివర్తన అనే థీమ్‌పై ఈ ఏడాది సదస్సు జరగనుంది. ఈ సదస్సులో డాక్టర్ గురునాథరావు భౌతికరసాయనశాస్త్ర బోధనకు ఓ కొత్త నమూనా ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానల్స్ పియర్ ఇన్‌స్ట్రక్షన్ అనే అంశంపై తన పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ విధానం విద్యార్థుల్లో ఆలోచన శక్తి, విజ్ఞాన పరిపుష్టి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే కాకుండా తరగతిలో ఉత్సాహం, చురుకుదనంలో కొంతమార్పు తీసుకువచ్చేందుకు దోహదపడనుంది. గురునాథరావు ప్రస్తుతం కేసముద్రం మండలం పెనుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతికరసాయనశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. గురునాథరావు నేషనల్ టీచర్స్ సైన్స్ కాన్ఫరెన్స్-2025కు ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణ మూర్తి, ఎంఈవో, హెచ్‌ఎం కాలేరు యాదగిరి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆస్తికోసం తల్లినే హత్య చేసిన కూతురు

● భర్త, అతడి స్నేహితుడితో కలిసి ఘాతుకం ● 9న దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య

● మహిళ హత్య కేసులో ముగ్గురు నిందితుల రిమాండ్ ● వివరాలు వెల్లడించిన ఏసీపీ నర్సయ్య

పాలకుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని ఓ మహిళ హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ జానకీరాం రెడ్డితో కలిసి ఏసీపీ అంబటి నర్సయ్య ఘటన వివరాలను వెల్లడించారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.

పాలకుర్తి మండలంలోని పెద్దతండా(కే)కు చెందిన బాదావత్ లక్ష్మి, వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఆమె భర్త తిరుపతి 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ఒక కూతురు సంగీత ఉంది. దుబ్బ తండా(ఎస్‌పీ)కు చెందిన ఆటో డ్రైవర్ బానోతు వీరన్నను సంగీత ప్రేమించి 2020లో పెళ్లి చేసుకుంది. మొదటి వీరి పెళ్లికి తల్లి వ్యతిరేకించినా తర్వాత సమ్మతి తెలిపింది. తనకున్న భూమిలో 25గుంటల భూమి విక్రయించి కట్నం కింద రూ.3లక్షలు, 8 తులాల బంగారం ఇచ్చింది. మిగిలిన రూ.5లక్షలు జీవన అవసరాల కోసం తన వద్ద ఉంచుకుంది.

లక్ష్మికి జనగామ శివారు బాణాపురంలో ప్లాట్, తండాలో 20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. దానిపై కుమార్తె కన్ను పడింది. పలు మార్లు పట్టా చేయాలని తల్లిని కోరగా, ఆమె నిరాకరించింది. భూమిని దక్కించుకోవాలని దురుద్దేశంతో తల్లిని హత్య చేయాలని స్కెచ్ వేసింది. ఈ విషయాన్ని భర్తతో చర్చించింది. భర్త వీరన్న సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం నార్సింగ్ తండాకు చెందిన తన స్నేహితుడు భూక్యా స్వామీట్‌తో కలిసి హత్యకు ప్రణాళిక రచించాడు. స్వామీట్‌కు రూ.50వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. హత్య చేయాలని నిర్ణయించుకున్న ముగురు ఈనెల 9న అర్ధరాత్రి పెద్దతండా (కే) గ్రామానికి చేరుకొని నిద్రలో ఉన్న లక్ష్మి ముఖంపై దిండు అదిమిపెట్టి శ్వాస ఆడకుండా చేసి హత్య చేశారు. తదనంతరం హైదరాబాద్‌కు పారిపోయారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి నేనావత్ చెంద్యా ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు చేదించడంలో సీఐ జానకీరాంరెడ్డి, ఎస్సై పవన్‌కుమార్‌ను, సిఇబ్బందిని ఏసీపీ నర్సయ్య అభినందించారు.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

ఒకే ఇంటిపై పడ్డ రెండు పిడుగులు

● సొమ్మసిల్లిన మహిళ

మరిపెడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఒకే ఇంటిపై రెండు పిడుగులు పడగా ఆ ఇంటి ఇల్లాలు సొమ్మసిల్లిన సంఘటన గురువారం రాత్రి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి ఎల్లంపేటకు చెందిన వంగూరి వెంకన్న ఇంటిపై క్షణాలల్లోనే ఒకేసారి రెండు పిడుగులు పడ్డాయి. దీంతో ఆయన భార్య వెంకటమ్మ సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెకు స్థానికంగా వైద్య చికిత్సలు చేయగా తేరుకుంది. ఆ ఇంటి పైకప్పు రెండు చోట్ల బీటలు పడ్డాయి. ఎవ్వరికి ఏ విధమైన ప్రమాదం జరగకపోవడంతో ఆ కుటుంబ సభ్యులంతా ఊపిరి పీల్చుకున్నారు.



ఎల్లంపేటలోని ఓ ఇంటిపై పిడుగుపడి బీటలు పడ్డ ఇంటిపై కప్పు, ఇళ్లు

గొర్రెల మందపై పిడుగుపాటు

అక్కడికక్కడే 94 గొర్రెల మృత్యువాత.. సుమారు రూ.10 లక్షల నష్టం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో 94 గొర్రెలు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పెద్దంపేట గోదావరి శివారు ప్రాంతంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, గొర్రెల కాపరులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబట్‌పల్లికి చెందిన సుమారు ఆరు గొర్రెల మందలు పెద్దంపేట-లెంకలగడ్డ గ్రామ శివారులోని గోదావరి తీరంలో నిద్రిస్తున్నాయి. ఈ క్రమంలోనే రాత్రి సుమారు 9గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభం కాగా కాపర్లు మంద నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న గుడారంలోకి వెళ్లారు. ఈ క్రమంలోనే మందపై ఒక్కసారి పిడుగు పడడంతో గొర్రెలన్నీ ఎక్కడిక్కడ చెల్లాచెదురయ్యాయి. గొర్రెల అరుపులతో మందకాడికి వెళ్లిన కాపరులు మృత్యువాత పడిన గొర్రెలను చూసి ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే మందలోని మిగతా గొర్రెలను మరోచోటుకు తరలించారు. కాగా మృతి చెందిన గొర్రెల విలువ సుమారు 12లక్షల వరకు ఉంటుందని గొర్రెల యజమానులు తెలిపారు.

సుమారు 20ఏళ్లకు పైగా గొర్రెలను కాచుకుంటూ వాటిపైనే జీవనాధారం కొనసాగిస్తున్నామని.. ఆ ఆధారమే కనుమరుగై పోయిందంటూ కాపర్లు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం స్పందించి చనిపోయిన గొర్రెలకు నష్టపరిహారం అందించాలని కోరారు. కాగా చనిపోయిన గొర్రెల్లో కాట్రేవుల కత్తెరసాల-21 గొర్రెలు, కాట్రేవుల కల్యాణ్-17గొర్రెలు, కాట్రేవుల ఆదిరెడ్డి-20 గొర్రెలు, కాట్రేవుల మల్లేశ్-10 గొర్రెలు, కాట్రేవుల పున్నం చందర్-15 గొర్రెలు, కాట్రేవుల శ్రీశైలం-11 గొర్రెలు ఉన్నట్లు తెలిపారు. చనిపోయిన గొర్రెలను జిల్లా పశు వైద్యాధికారి కుమారస్వామి, మండల పశువైద్యాధికారి రాజబాపు, తహశీల్దార్ రామారావులు పరిశీలించారు. చనిపోయిన గొర్రెలకు పంచనామ, పోస్టుమార్టం నిర్వహించాక గోతి తీసి పాతి పెట్టినట్లు అధికారులు తెలిపారు.



మృత్యువాత పడిన గొర్రెలు

● కన్నీటి పర్యంతమైన గొర్రెల యజమానులు

తాము కష్టపడి పెంచుకున్న గొర్రెలు రెప్పపాటులో మృతిచెందడంపై గొర్రెల యజమానులు కన్నీటిపర్యంతమయ్యారు. ఒకే సారి 94 గొర్రెలు మృత్యువాత పడడంతో తీవ్ర మనోవేదనకు గురైయ్యారు. తాము పెంచుకున్న ఆస్తి ఆవిరై పోయిందంటూ రోదించిన తీరు కలచివేసింది.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

● చెల్పూరులో అర్ధరాత్రి ఘటన

గణపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును ఓ అగంతకుడు లాక్కెళ్లిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌటం మొగిలయ్య కేటీపీపీకి సంభందించిన బ్రిక్స్ ప్లాంట్ వద్ద వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కేటీపీపీలో ఆర్టీజన్ కావడం, నిరంతరం బ్రిక్స్ ప్లాంట్ వద్దే డ్యూటీ కావడంతో తన భార్య మొండమ్మతో కలిసి అక్కడే జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి రోజూ వారీలాగే తిని నిద్రలోకి జారుకున్నారు. అయితే శుక్రవారం రాత్రి 1గంట సమయంలో మొండమ్మ మలమూత్ర విసర్జనకు బయటకు వచ్చిన నేపథ్యంలో అకస్మాత్తుక వెనకాలే వచ్చిన అగంతకుడు ఓ టూవీలర్ టైర్‌ను మెడకు చుట్టి నాలుగు తులాల పుస్తెలతాడును మెడలోంచి తీసుకుని వెళ్లినట్లు పేర్కొన్నారు. తెల్లవారుజామున బంధువులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శుక్రవారం చోటు చేసుకున్నది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం బయ్యారం మండలం ముకుందాపురం గ్రామ శివారు సేవ్యాతండకు చెందిన కున్సోత్ సుమన్(36) భార్య భర్తల మధ్య చిన్నపాటి ఘర్షణ జరగడంతో ఈ నెల 10న పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమణించి జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో 11న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. చికిత్స అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య మౌనిక, కుమారుడు, కూతురు ఉన్నారు.

పనులు చేయకుండానే బిల్లులు స్వాహా

బయటపడుతున్న ఈజీఎస్ అవకతవకలు

తొర్రూరురూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు మండలంలో 2024-2025 సంవత్సరానికి గాను చేపట్టిన 16వ విడత సామాజిక తనిఖీల్లో ఈజీఎస్ అవకతవకలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. గత మూడు రోజుల పాటు మండలంలోని కంఠాయపాలెం, చెర్లపాలెం, వెల్లికట్టె, మాటేడు, గుర్తూర్, అమ్మాపురం గ్రామాల్లో ఆడిట్ బృందం తనిఖీలు చేపట్టి శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో జరిగిన పనులు, గుర్తించిన అవకతవకలను ఆయా గ్రామ ప్రత్యేకాధికారులు, ప్రజల ముందు వెల్లడించారు. కంఠాయపాలెం గ్రామంలో మస్టర్ నిర్వాహణలోపంతో, పని చేయకుండానే రూ.5వేలు, నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకుండానే రూ.1300 బిల్లులు చెల్లించినట్లు గుర్తించారు.

గుర్తూర్ గ్రామంలో నర్సరీల్లో బ్యాగు ఫిల్లింగ్ చేయకుండానే రూ.21వేలు బిల్లులు తీసుకోవడం, మస్టర్‌లో సంతకాలు చేయించకపోవడంతో, పని చేయని వారికి బిల్లులు చేసినట్లు గుర్తించారు. వెల్లికట్టె గ్రామంలో మస్టర్ నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు పని చేయని వారికి రూ.8వేల బిల్లులు, జీపీ సిబ్బందితో నర్సరీ బ్యాగు ఫిల్లింగ్ చేయించారు. హరిపిరాల గ్రామంలో సిబ్బంది నిర్లక్ష్యంతో పని చేసిన వారికి కాకుండా, పని చేయని వారికి బిల్లు చెల్లించారు. అనేక చోట్ల ప్లాంటేషన్ మొక్కలు సగానికి పై ధ్వంసం కావడం, పని చేసిన వారికి కాకుండా, పని చేయని వారికి బిల్లులు చెల్లించడంతో కూలీలు పూర్తిగా నష్టపోయారు. ఆయా గ్రామాలో సామాజీక తనిఖీ బృందం ప్రతినిధులు రాణి, మౌనిక, సురేష్, కవిత, ప్రశాంత్, టీఏ, ఎఫ్ఏలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కంఠాయపాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న బీఆర్పీ కవిత

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే

● సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్ సీఐ జి మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్, మార్కెట్, కూరగాయల మార్కెట్, శ్రీనివాస్ సెంటర్, కోర్టు సెంటర్లలో రోడ్డుకు ఇరువైపు చిరువ్యాపారులతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్లకు ఇరువైపుల దుకాణాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్, అశోక్, సిబ్బంది ఉన్నారు.



నర్సంపేట బైపాస్‌లో చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడలు

జఫర్‌గడ్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనూరులో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నారు. తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో భాగంగా రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లా స్థాయిలో బాలురు, బాలికల జట్లు పాల్గొంటాయని టోర్నమెంటు ఆర్గనైజర్ గాదెపాక అయోధ్య శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కన బరిచిన బాల బాలికలను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. ఈనెల 13,14వ తేదీల్లో నిర్వహించే ఈ బాల్ బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ పోటీలను స్థానిక జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిం చడం జరుగుతుందన్నారు. క్రీడల విజయవంతానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

వందేభారత్ రాకపోకల్లో స్వల్ప మార్పులు

గిర్మాజిపేట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాకపోకల్లో స్వల్ప మార్పులు చేశారు. సికింద్రాబాద్- విశాఖపట్టణం మధ్య వరంగల్ మీదుగా ప్రస్తుతం గురువారం మినహా మిగతా ఆరు రోజులు నడుస్తున్న ఈ రైళ్లు డిసెంబర్ 5 నుంచి గురువారానికి బదులుగా సోమవారం ట్రిప్పులను రద్దు చేశారు. ఇకనుంచి సోమవారం మినహా మిగిలిన ఆరు రోజులు రాకపోకలు సాగిస్తాయని దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైళ్లరాకపోకల వేళలు, ఆగుతున్న స్టేషన్‌లలో ఎలాంటి మార్పులు లేవని పేర్కొన్నారు.

క్రీడల్లో విద్యార్థికి తీవ్ర గాయం

కొత్తగూడ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యో తి) : మండంలంలోని పొగుళ్లపల్లిలోని ఈఎంఆర్‌ఎస్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థా యి క్రీడల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెం దిన విద్యార్థి చరణ్‌కు తీవ్ర గాయమైంది. చరణ్‌కు రెజ్లింగ్ క్రీడ ఆడుతుండగా చేయికి తీవ్రగాయం కావటంతో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు 108లో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

రేపు కబడ్డీ సబ్ జూనియర్స్ జట్ల ఎంపిక

రఘునాథపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చాగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 14న కబడ్డీ సబ్ జూనియర్స్ బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపాణి, అధ్యక్షుడు వైకుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడుతూ కబడ్డీ జిల్లా జట్లకు ఎంపికయిన బాల బాలికలు నిజామాబాద్ జిల్లాలోని ముప్కల్‌లో ఈనెల 25 నుంచి 29 వరకు జరిగే 35వ సబ్ జూనియర్స్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు. కబడ్డీ సబ్ జూనియర్స్ జట్ల ఎంపిక కోసం వచ్చే బాలబాలికలు 30 నవంబరు 2009 తర్వాత జన్మించి 16 సంవత్సరాల లోపు ఉండడంతో పాటు బరువు 55 కేజీల లోపు ఉండాలన్నారు. ఎంపికకు ఒరిజినల్ ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సి మెమోతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9441636095, 9010255898 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కోతుల బారి నుంచి రక్షించాలి

● సీపీఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

● ఫారెస్టు, జీపీ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేత

గోవిందరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోతులబారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు శుక్రవారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రాలో ప్లకార్డులు చేబూని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కోతులు విచ్చలవిడిగా వీరంగం సృష్టిస్తున్నాయని, ఇళ్లలోకి చొరబడి దాడి చేయడంతోపాటు సామగ్రిని ఆగం చేస్తున్నాయని అన్నారు. ఇప్పటికే వేలాదిమంది కోతుల దాడిలో గాయపడ్డారని అన్నారు. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులతోపాటు ప్రతి ఒక్కరూ భయాందోళన చెందుతున్నారని అన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో అనేక అవస్థలు పడుతున్నారని, కోతుల సమస్య సామాజిక సమస్యగా మారిందని పేర్కొన్నారు. కోతుల నివారణకు అటవీశాఖ, గ్రామపంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోతుల వల్ల రైతుల పంట పొలాలకు నష్టం జరుగుతుందని, గ్రామాల్లోని చిరువ్యాపారులు, పండ్ల వ్యాపారులు, రోడ్లపై వెళ్లే ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం అటవీశాఖ కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎంపార్టీ నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, గొంది రాజేష్, తీగల ఆగిరెడ్డి, కడారి నాగరాజు, అంబాల మురళి, పురుషోత్తంరెడ్డి, సప్పిడి ఆదిరెడ్డి, బుర్ర శ్రీను, జిట్టబోయిన రమేష్, వల్లపు రాజు, సూర్యనారాయణ, గొర్ల శ్రీను, కందుల రాజేశ్వరితోపాటు పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.



పస్రా సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నకిలీ సిగరెట్ల కలకలం.!

కృష్ణకాలనీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలో నకిలీ సిగరెట్ల ఘటన కలకలం రేపింది. బ్రాండెండ్ కంపెనీకి చెందిన సిగరెట్ల వలే నకిలీ సిగరెట్లను యథేచ్చగా విక్రయిస్తుండగా పోలీసులు పసి గట్టారు. గోల్డ్‌ఫ్లాక్ కింగ్స్, లైట్స్ కింగ్స్ బ్రాండ్లకు చెందిన రూ. 1 లక్ష 57 వేల విలువైన నకిలీ సిగరేట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు పాల్పడిన పట్టణానికి చెందిన కొమురవెల్లి దినేష్, గోదావరిఖనికి చెందిన వేణుప్రసాద్‌లపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. ఇంకా నకిలీ సిగరేట్లలో భాగమైన ఇతర వ్యక్తులను కూడా గర్తించి తగిన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ సిగరేట్లు



కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం

పెరిగిన గోదావరి

మహదేవపూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద శుక్రవారం గోదావరి ఒకసారిగా పెరిగింది. ఎగువన మహారాష్ట్రలో వర్షాలు కురవడంతో ప్రాణహిత నది నుంచి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతోంది. దీంతో త్రివేణి సంగమం వద్ద గోదావరి 9.39 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తోంది.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద ప్రవాహం

● బ్యారేజీలోకి 3.95 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 3.95లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.20మీటర్లు ఎత్తులో ప్రవహిస్తుంది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7550	5300
మక్కలు	1752	1521
కందులు	4352	3022
పెసళ్లు	6250	3022
పల్లికాయ (సూక)	6690	3500
పల్లికాయ (పచ్చిది)	4150	2400
పసుపు (కాడి)	11409	7889
పసుపు (గోల)	10309	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16000	12000
యూఎస్341ఏసీ	14800	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

భారత ఆశలన్నీ నీరజ్‌పైనే


నీరజ్

స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం


డుప్లాంటిస్

నేటి భారత షెడ్యూల్

ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి

సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్ లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు అర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.

టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్డేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.


దక్షిణేశ్వర్ సురేష్

తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు

● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

ఫైనల్‌కు జైస్మిన్

సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్


జైస్మిన్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హుడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పుంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంర్ఖర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు
బంగ్లాదేశ్ x శ్రీలంక
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..


మహ్మద్ హరీస్ (66)

దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హరీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) పర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హరీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).

ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..

● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చౌ తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి

● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషబ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జప్‌నీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

బిజినెస్

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట

● 10 ఏళ్ల వరకు గడువు పెంపు

● సెబీ చైర్మన్ పాండే



ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్దిష్ట గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

ఇతర ప్రధాన నిర్ణయాలు

- రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు
- రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి
- నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట
- రీట్స్, ఇన్విట్స్. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ
- ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు

● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అస్సోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ

ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్లు లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ

బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

● ఐటీసీ ఆశీర్వాద్ మసాలా..నేచురల్ స్టార్ నానితో 'దమ్ము మీదే. స్టార్ మీరే' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ వాసుల అభిరుచులకు అనుగుణంగా దమ్దార్ ఫుడ్, సినిమా పేరుతో ఈ క్యాంపెయిన్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో భాగంగా వంటల పోటీలో గెలిచిన మహిళలతో నాని సినిమా థియేటర్ ప్రకటనలో కనిపించనున్నారు.

● హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థ ఫుజిఫిల్మ్ ఇండియా.. నిజామాబాద్‌లో తన అడ్వాన్స్‌డ్ ఏఎంయుఎల్ఈటీ ఇన్నోవాలిటీ ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ (ఎఫ్ఎఫ్‌డీఎం) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశ్వమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. బ్రెస్ట్ క్యాన్సర్ డయాగ్నోసిస్‌లో ఈ మమ్మోగ్రఫీ కీలకంగా ఉండనుంది.

● టాటా ఈవీ.. మార్కెట్లోకి సరికొత్త నెక్సాన్ ఈవీ విడుదల చేసింది. ఏడీఏఎస్ సేఫ్టీ టెక్‌తో దీన్ని తీసుకువచ్చింది. దీంతో పాటు కొన్ని కొత్త ఫీచర్లను పొందుపరిచింది. ఎంపవర్డ్ ప్లస్ ఏ45, ఏ45 డార్క్, ఏ 45 రెడ్ డార్క్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ నెక్సాన్ ఈవీ ధరలు వరుసగా రూ.17.29 లక్షలు, రూ.17.49 లక్షలు, రూ.17.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

నేడు మానుకోటలో విద్యుత్
సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలోని పాత బజారులోని పలుకాలనీల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్తిగార్డెన్, వ్యవసాయ మార్కెట్, వీఎస్ఆర్ గార్డెన్, నర్సంపేట బైపాస్, ఆర్టీసీ కాలనీ, ఏటిగడ్డతండ, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, అంబేద్కర్ కాలనీ, స్నేహనగర్, నందనగార్డెన్ ఏరియా, భవాని నగర్‌తండా, ఫారెస్ట్ సెంటర్, మునిసిపాలిటీ ఏరియాతో పాటు పలుకాలనీల్లో సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

● పట్టణంలోని కొత్తబజారులోని పలుకాలనీల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏఈ నవ్యశ్రీ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని బాబునాయక్‌తండా, మంగళకాలనీ, నెహ్రూసెంటర్, తహసీల్దార్ కార్యాలయం, మూడుకొట్ల సెంటర్, పాతకలెక్టర్ కార్యలయం ఏరియా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, బీసీ కాలనీ, కురవి గేటు, కలెక్టర్ కార్యాలయం , ధర్మన్నకాలనీ, బ్యాంకు కాలనీ, కంకరబోడు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

● కొత్తగూడ : కొత్తగూడ మండలంలో నేడు ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ఏఈ సురేష్ పేర్కొన్నారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ కొత్తగూడలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమతు పనులు చేపడుతుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్టు పేర్కొన్నారు.

పరిహారం డబ్బులు చెల్లించాలి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో మూడోరైల్వే లైన్ వచ్చిన సందర్భంగా కురవిరోడ్‌లోని పాతరైల్వేగేట్ వద్ద ఇల్లు కోల్పోయిన వారికి పరిహారం డబ్బులు వెంటనే చెల్లించాలని సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి. అజయ్‌సారధిరెడ్డి కోరారు. కురవి రోడ్‌లో ఇల్లు కోల్పోయిన ప్రాంతంలో శుక్రవారం సీపీఐ నాయకులు, ఇల్లు కోల్పోయిన భూ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఉంటూ జీవనం సాగించిన వారిని రైల్వే మూడవ లైన్ రావడంతో ఒక్క సారిగా ఇల్లు కూల్చి వేయడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం అందక పోవడంతో ఆందోళన చెందుతున్నారని చెప్పారు. భూక్య ఓంజీనాయక్, నసీ మున్నీషా, గాడిపెల్లి సతీష్, యాదగిరి, నాగేశ్వర్‌రావు, సమ్మయ్య, చాంద్‌పాషా, అక్బర్, అలీ, మునిషా, సీపీఐ నేతలు పెరుగుకుమార్, వెలుగు శ్రావణ్, మెతుకు కుమార్ పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన చెందొద్దు

● అందరికీ బస్తాలు అందిస్తాం
● ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్


నేరడలో యూరియా బస్తాల పంపిణీని పర్యవేక్షిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మరిపెడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అన్నారు. శుక్రవారం మరిపెడ పీఏసీఎస్‌లోని యూరియా పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతులకు అవసరమయ్యే యూరియా అందుతుందన్నారు. యూరియా పంపిణీపై ఆయన ఆరా తీశారు. ఎస్పీ వెంట చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి, స్థానిక సీఐ రాజ్‌కుమార్ గౌడ్, ఎస్సైలు సతీశ్, కోటేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

● దంతాలపల్లి : ఖరీఫ్ సాగులో రైతులందరికీ యూరియా బస్తాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శుక్రవారం ఆయన దంతాలపల్లిలోని పీఏసీఎస్ గోదాంను ఆకస్మికంగా పరిశీలించి యూరియా పంపిణీ రిజిష్టర్లను పరిశీలించి వ్యవసాయాధికారులు, ఇతర ఉన్నతాధికారులకు సూచనలు చేశారు. అధికారులు క్లస్టర్ వారీగా యూరియాను పంపిణీ చేసి ఇబ్బందులను తొలగించాలన్నారు. రైతులు ఆందోళనకు గురికాకుండా ఉండేందుకు సూచనలు చేశారు.

● కురవి : నేరడ సొసైటీ గోదాంలో యూరియా బస్తాల పంపిణీని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ స్వయంగా పర్యవేక్షించారు. సొసైటీ సిబ్బంది తక్కువగా ఉండడంతో రసీదులు ఇచ్చే బాధ్యతను పోలీస్ కానిస్టేబుళ్లకు అప్పగించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్‌లో ఉన్న రైతులందరికి యూరియాను అందించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై సతీష్ ఉన్నారు.

● ఇనుగుర్తి : ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో యూరియా పంపిణీని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాబితాల ఆధారంగా యూరియా పంపిణీ చేయడంపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కేసముద్రం ఎస్ఐ కరుణాకర్ ఉన్నారు.


కల్వలలో కానిస్టేబుల్ అలీంను సన్మానిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

కానిస్టేబుల్‌ను సన్మానించిన ఎస్పీ

● యూరియా లారీని నడపడంపై అభినందనలు

కేసముద్రం, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : లారీని నడిపి యూరియాను సకాలంలో రైతులకు అందించేందుకు కృషి చేసిన కేసముద్రం కానిస్టేబుల్ ఎండీ.అలీంను అభినందిస్తూ కల్వలలో శుక్రవారం జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సన్మానించారు. మండలంలోని కల్వల, ధన్నసరి సొసైటీ ఎరువుల కేంద్రాలను జిల్లా ఎస్పీ సందర్శించి, రికార్డులను పరిశీలించారు. యూరియా లారీని తీసుకువస్తున్న డ్రైవర్ కేసముద్రంలో తప్పతాగి నిద్రించడంతో సదరు లారీని కానిస్టేబుల్ అలీం నడిపించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కల్వలలో ఎరువుల కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన జిల్లా ఎస్పీ అక్కడే విధులు నిర్వహిస్తున్న అలీంను అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. రైతులకు సకాలంలో యూరియా అందించేందుకు చొరవ చూపడం హర్షించదగ్గ విషయమని ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మురళీధర్‌రాజ్ ఉన్నారు.

పుస్తక గోదాంను పరిశీలించిన డీఈవో

● జిల్లాకు 1.49 లక్షల పాఠ్య పుస్తకాల రాక

కేసముద్రం, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి జడ్పీ ఉన్నత పాఠశాలలోని జిల్లాస్థాయి పుస్తకగోదాంను శుక్రవారం డీఈవో దక్షిణామూర్తి ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లాకు పార్ట్-2 పాఠ్యపుస్తకాలు, పదో తరగతి అభ్యాస దీపికలు, ఉల్లాస్ కరదీపికలు, డిజిటల్ లెర్నింగ్ 1,49,440 పుస్తకాలు వచ్చాయని, సోమవారం నుంచి మండలాలకు పంపిణీ చేస్తారని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో డీఈవో దక్షిణామూర్తి, ఏఎంవో చంద్రశేఖర్ ఆజాద్, డీఎస్‌వో అప్పారావు, హెచ్‌ఎం వి.రాజశేఖర్, జిల్లా పుస్తక గోదాం ఇన్‌చార్జ్ చీకటి వెంకట్రాంనర్సయ్య పాల్గొన్నారు.

విధుల్లో చేరిన గ్రామపాలన అధికారులు


నెల్లికుదురు సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 రెవెన్యూ క్లస్టర్‌లకు గ్రామపాలనా అధికారులు శుక్రవారం విధుల్లో చేరినట్లు తహసీల్దార్ చంద నరేష్ తెలిపారు. మేచరాజు పెల్లి రెవెన్యూ క్లస్టర్‌గ్రామపాలనా అధికారిగా దారవత్‌గోపిసింగ్, ఎర్రబెల్లిగూడెం రామాంపురం పులుగుజ్జ మధుసుదన్, బ్రాహ్మణకొత్తపల్లి అరిగె సందీప్, కాచికల్‌నారబోయిన వెంకటరమణ, నైనాల అనిరెడ్డి మురళి, నెల్లికుదురు గంగినేని ఉప్పలయ్యరాజుల కొత్తపల్లి పేసరు రమేష్, ఆలేరు మునరి జనార్ధన్, నర్సింహులగూడెం కుంటనవీన్, వావిలాల లకావత్ దివ్యభారతి, శ్రీరామగిరి గుమ్మడి విజయ్, మధనతుర్తి మండల భిక్షపతి, మునిగలవీడు షేక్ అబ్బల్, రావిరాల ఎలిశాల ఉపేంద్రలు విధుల్లో చేరినట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఇంజన్ బోల్తా - తప్పిన ప్రమాదం

మహబూబాబాద్ రూరల్ , సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మండలం కంబాలపల్లి పెద్దచెరువు సమీపంలో శుక్రవారం ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కంబాలపల్లికి చెందిన నల్లపు సత్యం-మంగమ్మ దంపతులు ట్రాక్టర్ ఇంజన్‌పై యూరియా కట్టలు వేసుకొని పొలం వద్దకు వెళ్లి వస్తున్న క్రమంలో పెద్దచెరువు పెద్దకాలువ వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడింది. ఈ ఘటనలో మంగమ్మకు స్వల్పగాయాలయ్యాయి.

రసాయన ఎరువులు మితంగా వాడాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల


ముల్కనూరులో వరి పంటను పరిశీలిస్తున్న విజయనిర్మల

గార్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఖరీఫ్ వరి సాగు రైతులు రసాయన ఎరువులు మితంగా వాడుకొని అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయనిర్మల సూచించారు. శుక్రవారం ముల్కనూరులో వరి పంట పొలంలో క్షేత్ర సందర్శన చేపట్టి రైతులకు ఎరువుల వాడకంపై పలు సూచనలు చేశారు. ఏవో రామారావు, మేఘన, రైతులు సాగర్ బాబు, జాస్తీ రాజా పాల్గొన్నారు.

అనారోగ్యంతో వివాహిత మృతి

పెద్దవంగర, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో వివాహిత మృతి చెందిన సంఘటన కాన్వాయిగూడెంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్సై కాంత్రికిరణ్ వివరాల ప్రకారం. కాన్వాయిగూడెంకు చెందిన తాండాల కళ్యాణి భర్త సతీష్‌తో కలిసి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. వారం రోజులుగా వైరల్ ఫీవర్ రావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్దకు వెళ్లగా తొర్రూరు వెళ్ళమని చెప్పగా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించింది. మృతురాలి భార్త తండాల సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు 30 వరకు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న వివిధ గ్రేడుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈ నెల 12 నుండి స్వీకరించబడునని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బాబు శుక్రవారం తెలిపారు. ఈనెల 15 నుంచి 30 వరకు వాక్‌ఇన్ ద్వారా ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు స్పాట్‌లో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్ https://iti.telan gana. gov. inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. అర్హులైన, ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30 వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉంటుందని తెలిపారు. 1 ఆగస్టు, 2025 వరకు విద్యార్థులకు 14 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు సంబంధిత అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సీట్ల భర్తీ ప్రక్రియ మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపాదికన కేటాయించబడునని తెలిపారు.

మొదటి, రెండవ, మూడవ దఫాలో దరఖాస్తు చేసుకొని ప్రవేశం పొందని అభ్యర్థులందరు నేరుగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశానికి హాజరుకావచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సెల్ ఫోన్ నెంబర్లు, ఆధార్ నెంబర్లు రాయాలని సూచించారు. జిల్లాలో అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం బీజేపీ కుట్రలు

● యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం బీజేపీ కుట్రలు చేస్తుందని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్ విమర్శించారు. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయబాను, రాష్ట్ర ఇన్‌చార్జ్ సయ్యద్‌ఖలీద్, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి పిలుపుతో మహబూబాబాద్ శివారు బోడ గుట్టతండాలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓటు చోరీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేష్‌నాయక్ మాట్లాడుతూ...కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కొన్ని రాష్ట్రాల్లో అక్రమ ఓట్లు సృష్టించి అధికారాన్ని చేజిక్కించుకునే కుట్ర చేస్తుందని ఆరోపించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకున్ని ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు రాంపెల్లి నవీన్, గండు కార్తీక్, బానోత్ సుందర్, కాంగ్రెస్ నాయకులు అజ్మీర కిషన్, వీరన్న, వెంకన్న, లింగ్యా, వీరోజీ, రామారావు, లింగయ్య, శంకర్, రమేష్, నాగేందర్, వినోద్‌కుమార్, నాగేష్, సంతోష్, నరేష్ పాల్గొన్నారు.

పేదల కోసం ఉద్యమించిన నేత ఏచూరి : సీపీఎం


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల కోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా తనతుది శ్వాస విడిచేంత వరకు పోరాడిన కమ్యూనిస్టు దిగ్గజం సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఆకుల రాజు అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకులరాజు మాట్లాడుతూ 12 ఆగస్టు 1952లో మద్రాసులో తెలుగు కుటుంబంలో జన్మించిన సీతారాం ఏచూరి 1974లో ఎస్ఎఫ్ఐలో చేరి విద్యార్థి ఉద్యమాల్లో కీలక భూమిక పోషించారని చెప్పారు. 2015 నుంచి ఆయన చనిపోయేంత వరకు సీపీఎం జాతీయ కార్యదర్శిగా పనిచేసి దేశ వ్యాప్తంగా మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించారని చెప్పారు. ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం సీతారాం ఏచూరి అలుపెరగని పోరాటాలు ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుంట ఉపేందర్, బానోత్ సీతారాంనాయక్, సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, చీపిర యాకయ్య, మహ్మద్ రజాక్, నర్సింహారావు, శ్రీరాంనాయక్, సైదులు, కిరణ్, కోటి, లక్ష్మయ్య, ప్రకాశ్, సుమన్ పాల్గొన్నారు.

రేపు లైసెన్స్‌డ్ సర్వేయర్ల రాత పరీక్ష

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈనెల 14న లెసెన్స్‌డ్ సర్వేయర్ల రాత పరీక్షను నిర్వహించనున్నట్లు ల్యాండ్‌అండ్‌సర్వే ఏడీ నర్సింహామూర్తి తెలిపారు. ప్రభుత్వం భూమి కొలతల రికార్డుల కార్యాలయం ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాలో 200 మందికిగా సర్వేయర్ల శిక్షణ పూర్తి చేశారు. అందులో 181 మంది మొదటి దశలో పరీక్ష రాయగా, 30 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ ఆదేశాలతో రాత పరీక్షలో అర్హత సాధించిన వారు గత 40 రోజులుగా మండల ఆఫీసుల్లో అప్రెంటిస్ శిక్షణ పూర్తి చేశారు. కాగా, మొదటి దఫాలో పరీక్ష రాసి ఉత్తీర్ణులు కాని వారికి, రెండోసారి పరీక్ష రాసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెండో దఫా పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్న 94 మందికి ల్యాండ్‌అండ్‌సర్వే జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏడీ నర్సింహామూర్తి హాల్ టిక్కెట్లను పంపిణీ చేశారు.

16 వరకు డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 15, 16 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ శుక్రవారం తెలిపారు. ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు 2025-26 విద్యాసంవత్సరం కళాశాలలో స్పాట్ ప్రవేశాలు పొందే విద్యార్థులు అర్హతల అన్ని సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 17న సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 18, 19 తేదీల్లో జరిగే రెండవ విడత స్పాట్ ప్రవేశాలలో లోకల్‌తో పాటు నాన్‌లోకల్ విద్యార్థులు కూడా పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు దోస్త్ కో-ఆర్డినేటర్ సాంబశివరావు సెల్ నెంబర్ : 94403 43941ను సంప్రదించాలన్నారు.

పదోన్నతులకు ఆటంకంగా మారిన జీవో 2ను రద్దు చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయుల పదోన్నతులకు ఆటంకంగా మారిన జీవో నెంబర్ 2న రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల ఉద్యోగ, ఉపాధ్యాయుల పదోన్నతుల్లో అడక్వసీ జీవో నెంబర్ 2ను రద్దు చేయాలన్నారు. జీవో నెంబర్ 2లోని (4) ఏ పాయింట్ అడ్డంపెట్టుకొని, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయంగా రావాల్సిన పదోన్నతులు రాకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మెరిట్‌లో పదోన్నతులు పొందిన వారిని రిజర్వేషన్లలో చూపిస్తూ ఎస్సీ 15శాతం, ఎస్టీలు 10 శాతం మొత్తం పోస్టులలో 25 శాతం కంటే ఎక్కువగాఉండకూడదనే నిబంధన విధించారని, దాని వలన వందల సంఖ్యలో గెజిటెడ్ హెడ్మాస్టర్స్, స్కూల్ అసిస్టెంట్, పీఎస్ హెచ్‌ఎం పోస్టు లు నష్టపోయారని తెలిపారు. తక్షణమే జీవో నెంబర్ 2ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం నాయకులు ఐలయ్య, వెంకటేశ్వర్లు, వీరన్న, శంకర్‌నాయక్, రామన్న, శ్రీను, మల్లయ్య, ప్రభాకర్, సునిత, జ్యోతి, రమ, ప్రకాష్ పాల్గొన్నారు.

నిస్వార్థ ప్రజా నాయకుడు ఓంకార్

ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి రవి

తొర్రూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవితం చరమాంకం వరకు పీడిత ప్రజల పక్షాన పోరాడిన గొప్పనేత మద్దికాయల ఓంకార్ అని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి రవి అన్నారు. శుక్రవారం తొర్రూరులో నిర్వహించిన ఓంకార్ శత జయంతి సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. వెట్టిచాకిరీ నిర్మూలించి దున్నేవాడికే భూమి అనే నినాదంతో ప్రజల ముందుకు వచ్చి నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఓంకార్ పాత్ర కీలకమని తెలంగాణ సాయుధ పోరాటాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లి ఎనలేని కృషి చేశాడని ఆదివాసీలకే హక్కులు ఉండాలనే నినాదంతో పనిచేసిన గొప్ప నాయకుడని అన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. శత జయంతి సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు నాగయ్య, చిన్న చంద్రన్న, ఐలయ్య, కుమారస్వామి, సుధాకర్, సుకన్య, మట్టయ్య, కొమురయ్య, బాబూరావు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉన్నతస్థాయి గుర్తింపు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నతస్థాయిలో గుర్తింపు పొందవచ్చని తహసీల్దార్ గడీల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తొర్రూరు మండలం మాటేడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు మదర్ వలంటరీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.30వేల విలువ గల క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, ఆర్‌ఐ నజీముద్దీన్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు విక్రమ్ కుమార్, అధ్యక్షుడు సాయినాథచార్యులు, సురేందర్, గ్రామస్థులు, దాతలు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో పోలీసుల అవగాహన

కేసముద్రం, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పాలిటెక్నికల్ కళాశాలలో శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ పి.నరేష్ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు స్వీయనియంత్రణతో చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టిసారించి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సిహెచ్.నర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

డోర్నకల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రమాదాల నివారణకు సిబ్బంది, ప్రజలు, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ విజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీసెంటర్‌లో విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి ఎర్త్ సౌకర్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వాడాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. డీఈ విజయ్, డోర్నకల్ డిస్కం ఏఈ కిరణ్, కురవి ఏవో రమేష్ పాల్గొన్నారు.

ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలి

● మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ ఫరీద్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంను అనుసరించాలని మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ ఎమ్డీ ఫరీద్ అన్నారు. మహబూబాబాద్‌లోని గౌసియా మస్జిద్ వద్ద మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని పాతబజార్ ముస్లిం యూత్ కమిటీ, ఆహ్లే సున్నత్ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరు మానవతాదృక్పథంతో ఆలోచించి స్నేహపూర్వకంగా ఉండాలని కోరారు. యువత సామాజిక అంశాలపై అవగాహన పెంచుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మౌలాన సయిద్ రిజ్వీ ఆహ్మద్, మహ్మద్ పరీద్, మహ్మద్ ఖలీల్, మహ్మద్ అసద్‌అలీ, మహ్మద్ రఫీక్, సాజిద్, వహీద్, మహ్మద్ గౌస్, మహ్మద్ జమీల్, ఫయిజ్, ఆశ్రఫ్, గయాజ్, అస్లాం, ఇమ్రాన్, మోహసిన్, ఫజిల్, సమీర్, ముబీన్, ఫయిజల్, అన్సార్, రహీం, పర్‌హన్, నయిద్ పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్

● నాలుగు గంటల పాటు నిలిచిన రైలు

డోర్నకల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్తున్న రైలు నెంబరు 17202 గోల్కొండ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం సాయంత్రం సాంకేతిక లోపంతో డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో సుమారు నాలుగు గంటల పాటు నిలిచిపోయింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం. కాజీపేట రైల్వేస్టేషన్ దాటిన తర్వాత రైలు వెనుక నుంచి 5వ బోగీ అయిన డీ-2 రైలు పెట్టెకు చెందిన చక్రాల వద్ద నుంచి పొగ రావడంతో రైలును వరంగల్ రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు నిలిపి వేశారు. అక్కడి రైల్వే సిబ్బంది తాత్కాలిక మరమతులు చేసిన తర్వాత రైలును పంపిచారు. మార్గ మధ్యంలో లోపం తలెత్తితే సరి చేయడానికి ఇద్దరు మెకానిక్ సిబ్బందిని అదే రైలులో పంపించారు. అనంతరం రైలు మహబూబాబాద్ రైల్వేస్టేషన్ దాటిన తర్వాత హాట్ యాజిల్ (రైలు చక్రాలకు ఉండే బేరింగ్‌లు రాపిడికి గురైనప్పుడు అందులో నుంచి పొగతో పాటు స్వల్పంగా మంటలు వచ్చాయి)కు గురైంది. దీంతో రైలు డోర్నకల్‌కు చేరుకున్న వెంటనే డోర్నకల్‌కు చెందిన సీఅండ్ డబ్లూ సిబ్బంది బోగీని పరిశీలించి, దానిని రైలు నుంచి వేరు చేశారు. అనంతరం రైలు డోర్నకల్ నుంచి గుంటూరు బయలుదేరి వెళ్లింది. దీంతో రైలు సుమారు నాలుగు గంటల పాలు ఆలస్యం అయింది.

లేగదూడ మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అజాగ్రత్తగా కారు నడిపి లేగదూడ మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ జి.మహేదర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస సెంటర్ నుంచి నెహ్రూ సెంటర్‌కు వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డుపై వెళ్తున్న లేగదూడను వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కారు డ్రైవర్ సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిధుల లేమి.. సమస్యల కొలిమి

(3వ పేజీ తరువాయి)

మునిసిపల్ కమిషనర్‌కు ఇక్కడ కమిషనర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. మరిపెడ మునిసిపాలిటీలో పనిచేస్తున్న ఇద్దరు వార్డు ఆఫీసర్లను డిప్యూటేషన్‌పై ఇక్కడికి పంపారు. సాధారణంగా మునిసిపాలిటీకి కమిషనర్, ఇంజనీర్, పట్టణ ప్రణాళికాధికారి, రెవెన్యూ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సూపర్‌వైజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, క్లరికల్ స్టాఫ్, బిల్ కలెక్టర్లు, వాహన డ్రైవర్లు, వాచ్‌మెన్‌లు ఉంటారు. వీరికి మునిసిపల్ శాఖ నుంచి వేతనాలు అందుతాయి. అలాంటిది కేసముద్రం మునిసిపాలిటీకి ఒక్క పోస్టు కూడా కేటాయించకపోవడం గమనార్హం. నిధుల లేమితో కొట్టుమిటాడుతున్న మునిసిపాలిటీకి ప్రజల సమస్యలు తీర్చేందుకు, నిర్వహణ కోసం రూ.2కోట్ల నిధులు యుద్ధప్రాతిపదికన కేటాయించాల్సిన అవసరం ఉన్నట్లు ఆయా వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి నిర్వహణ నిధులను కేటాయించి సమస్యలను పరిష్కరించాలని, శాశ్వత సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

టెట్‌పై సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాలి

కురవి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల పైబడి సర్వీస్ ఉన్న ఇన్‌సర్వీస్ టీచర్లందరూ రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాలని లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.యాకూబ్ డిమాండ్ చేశారు. కురవి మండలంలోని మొగిలిచర్ల, నారాయణపురం, గుండ్రాతిమడుగు, రాజోలు, బలపాల పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కాంపెయినింగ్‌లో భాగంగా ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. సర్వీస్‌లో ఉన్న సీనియర్ టీచర్ల ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్‌లు దాఖలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పి.మంజుల, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీన్‌కుమార్, బి.బాబు, సురేష్, ఎల్లయ్య, సునీత, సింధు, ప్రతాప్, విజయరాణి పాల్గొన్నారు.